
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 16 జనవరి 2025 | 5



కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు.. 7లో

ఊరంతా సంక్రాంతి

కోడి పందేల హోరు



అచ్చంపేట జంక్షన్‌లో ..

కాకినాడ జిల్లాలో జూద జాతర

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో కోడిపందేల జాతర కొనసాగింది. పందెంరాయుళ్ల పోటీతో పుంజులు బరుల్లో పోటాపోటీగా తలపడ్డాయి. దీంతో కోట్లలో కట్టలు తెగిపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ బరుల్లో నువ్వానేనా అన్నట్లు పండగ మూడు రోజులలో జిల్లాలో పందేలు జరిగాయి. మూడురోజులపాటు రేయింబవళ్లు కోడి పందేలు హోరెత్తాయి. సంక్రాంతి రోజైతే ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి మరీ పందెం రాయుళ్లు పోటీపడ్డారు. పందేలు కాయడానికి వచ్చే వారిని ఆకట్టుకునేందుకు భారీ షామియానాలు, కుర్చీలు, లైవ్‌షోలు, డ్యాన్సులు, విందు ఏర్పాటు చేయడంతో బరులన్నీ జాతరలను తలపించాయి. బరులను ఆనుకుని గుండాట వ్యాపారం కోట్లలో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు గుండాట బోర్డులు నిర్వాహకులకు కోట్లలో కాసులు కురిపించాయి.

కాకినాడ జిల్లావ్యాప్తంగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా మూడురోజుల్లో కోడిపందేలు, గుండాట కలిపి రూ.250 కోట్లకుపైగా వ్యాపారం జరిగింది. పోలీసులు సైతం బరులవైపు కన్నెత్తి చూడకపోవడంతో పందెంరాయుళ్లు బరితెగించేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా 490వరకు బరులు ఏర్పాట్లయ్యాయి. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో కోడి పందేల విజేతలకు బుల్లెట్లు, కారు బహుమతులుగా ఇవ్వడంతో పందెంరాయుళ్లు విరగబడ్డారు. తుని నియోజకవర్గం పరిధిలో కోటనందూరు, తుని, తొండంగిలో పోలవరం కాలువ వెంబడి, హైవే తోటల్లోను భారీగా బరులు నిర్వహించారు. పెద్దపెద్ద టెంట్లు, లైట్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. తుని నియోజకవర్గంలో పందేలు, గుండాట, పేకాట కలిపి రూ.15కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. ప్రత్తిపాడులో ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన గుండాట వ్యాపారికి మూడురోజుల్లో రూ.25 లక్షల లాభం వచ్చింది. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో పామాయిల్ తోటల్లో మూడురోజులపాటు జరిగిన కోడి పందేలు, గుండాట జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచాయి. తెలంగాణ నుంచి సైతం పందెంరాయుళ్లు రావడంతో ఒక్కో బరిలో కోట్లలో వ్యాపారం జరిగింది. జగ్గంపేటలో ఓ బరిని రూ.36లక్షలకు వేలంలో పాడుకున్న ఓ నిర్వాహకుడు అంతకు రెండింతలు గడించారు. సామర్లకోటలో ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. నియోజకవర్గంలో రూ.45కోట్ల వరకు లావాదేవీలు జరగ్గా గుండాట వ్యాపారమే రూ.32కోట్ల వరకు ఉంది. పిఠాపురం నియోజకవర్గం మొత్తం 80వరకు బరుల్లో పందేలు, గుండాట కలిపి రూ.25కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. కాకినాడ రూరల్‌లో ఒక్కో బరిని కొందరు రూ.30లక్షల నుంచి రూ.38లక్షలకు వేలంలో దక్కించుకోవడంతో పందెంరాయుళ్లను ఆకర్షించడానికి అనేక ఎత్తులు వేశారు. కరప మండలం కొరుపల్లిలో మూడురోజుల్లో అత్యధికంగా పందేలు గెలిచిన విజేత డేగల నాగేంద్ర అలియాస్ గోల్డ్‌బాబుకు రూ.18లక్షలు విలువ చేసే మహీంద్రా థార్ వాహనాన్ని నిర్వాహకులు అందజేశారు. పెద పూడి, తాళ్లరేవు, కాజులూరు మండలాల్లో రూ.5కోట్ల చొప్పున గుండాట వ్యాపారం జరిగింది.

గుండాటల జోరు



రూ.200 కోట్ల పందేల సందడి

రాజమహేంద్రవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు కోడిపందేలు, గుండాటలు, పేకాటల పేరిట రూ.200కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా. బరుల నిర్వాహకులకు గుండాట బోర్డులు తీసుకున్నవారు రూ.13కోట్ల వరకూ ఇచ్చారు. 18 మండలాల పరిధిలో ఒక్కో మండలానికి కనీసం 7 కోడిపందేల బరుల వంతున జిల్లాలో మొత్తం 125 బరుల వరకూ నడిచాయి. కోడిపందేల నిర్వాహకులు ముందుగా గుండాటలు, పేకాట నిర్వాహకులతో ఒప్పందం పెట్టుకున్నారు. గుండాట నిర్వాహకులు ఒక్కో బరికి కనీసం రూ.10లక్షలు ముందుగానే కోడిపందేల బరి నిర్వాహకులకు అందజేయాలని ఒప్పందం చేసుకున్నారు. రాజానగరంలో 10 గుండాట బోర్డులు పెట్టుకోవడానికి రూ.21లక్షలు నిర్వాహకులకు చెల్లించినట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులకు రూ.2.5కోట్ల నుంచి 3కోట్ల ముడుపులు అందినట్టు అంచనా. ఒక్కో బరి నిర్వాహకులు కనీసం 4 నుంచి 6 కేసులు పోలీసులకు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. భోగి నుంచి మొదలైన పందేలు కనుమరోజు సాయంకాలం ఐదుగంటలకే ముగియాల్సి ఉన్నా చాలాచోట్ల ఆరు, ఆరున్నర గంటలకు నిలిపివేశారు.

కోనసీమ జిల్లాలో కోట్లాట

చేతులు మారిన కోట్లాది రూపాయలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా సంక్రాంతి మూడురోజు నిర్వహించిన జూదాలు, పందేల్లో రూ.75కోట్ల మేర చేతులు మారినట్టు సమాచారం. పందేలు, రికార్డింగ్ డ్యాన్సులు యథేచ్ఛగా నిర్వహించినా కొందరు పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మురమళ్ల, చెయ్యేరు, కేశనకుర్రుపాలెం, రాజుపాలెం, రోళ్లపాలెం, గెద్దనపల్లి, గోడి, గోడిలంక, కామనగరువు, సమనస, పేరూరు, ఇందుపల్లిగరువు, రావులపాడు, వెదిరేశ్వరం, శివకోడు, మామిడికుదురు, అల్లవరం, ఠాణేలంక, కొత్తలంక, లొల్ల, పేరవరం, తాడిపూడి, ర్యాలి, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లిల్లో జాతీయ రహదారిని ఆనుకుని శివకోడు, మీవీ మెరక సబ్‌స్టేషన్, గున్నేపల్లి అగ్రహారం, కొంకాపల్లి, నడవపల్లి, గోగన్నమఠం, పాశర్లపూడి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంకతో పాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధితో సహా 400కు పైగా కీలక ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కీలక బరులు వద్ద కోడిపందాలు, గుండాట, పేకాట వంటి పోటీల ద్వారా కోట్లాది రూపాయిల మేర లావాదేవీలు జరిగినట్టు అంచనా. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతోపాటు అనేకమంది కూటమికి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై తిలకించారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌లో సంక్రాంతి సంబరాల పేరిట ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఉత్సవాల్లో కోడిపందేలు, గుండాట, బైక్ రైడింగ్‌లతోపాటు రాత్రివేళల్లో జబర్దస్త్ బృందాల ఆధ్వర్యంలో డ్యాన్సులు, హాస్యవల్లరి కార్యక్రమాలు నిర్వహించారు. రాజోలు మండలం పాలగుమ్మిలో పందెం బరి వద్ద రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలో పలుచోట్ల సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు హోరెత్తించాయి.



రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో



కొవ్వూరు మండలం పశివేదలలో..



ఐ.పోలవరం: పోటీలను తిలకిస్తున్న నేతలు



కరప: గొర్రిపూడి బరిలో గుండాట



తాళ్లపూడి:పందెంలో గెలుచుకున్న బుల్లెట్



కరప: జీపును గెలుచుకున్న గోల్డ్‌బాబు



రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కోడి పందాల విజేతకు బుల్లెట్ బహుమతి

కొత్తపేటలో ప్రభల సంబరం





కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద కొలువుదీరిన ప్రభలు

కొత్తపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం వేలాది జనసందోహం మధ్య అంబరాన్నంటింది. రాష్ట్రం నలుమూలలు నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం ప్రభల ఉత్సవాన్ని తిలకించేందుకు విచ్చేశారు. బోడిపాలెం, కొత్త, పాత రామాలయం వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రభలను ఊరేగింపుగా తీసుకురాగా వాటి ముందు మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాలు, సంగీత విభావరులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రభలు ముందుకు నడిచాయి. భక్తుల సందర్శనార్థం ప్రభుత్వ ఉన్నతపాఠశాలవద్ద ప్రభలు కొలువయ్యాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, ఏపీ బీజేపీ ప్రచారక్ విజయ ఆదిత్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు మొక్కుబడులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

వేలచింతలగూడెంలో క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలు

హాజరైన మంత్రి కందుల దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు



గోపాలపురం మండలం వేలచింతలగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, పక్కనే పలువురు ఎమ్మెల్యేలు

గోపాలపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపండుగ సంక్రాంతి అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గోపాలపురం మండలంలోని వేలచింతలగూడెంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపండుగ సంక్రాంతిని రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ, చిర్రి బాలరాజు, బత్తుల బలరామకృష్ణ, ధర్మరాజు, ఆదిరెడ్డి వాసు, బొలిశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాల్లో చివరి రోజైన ముగింపు సంబరాల్లో సినీగాయకులచే సంగీత విభావరి కార్యక్రమం ప్రజలను ఉర్రూతలూగించింది. యాంకర్స్ వింద్యా, విశాఖ, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి మాటలతో యువతను ఆకట్టుకున్నారు. సినీగాయకులు కృష్ణచైతన్య, కల్పన, వాగ్దేవి, కాసర్ల శ్యామ్, మోహన్‌భోగరాజు, సాకేత్, జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, రాజమౌళి, గడ్డం నవీన్, తన్మయి, గణేషన్, నృత్యకళాకారుడు గోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఆరునెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు



అమలాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు జోరందుకున్నాయి. రాజోలు పోలీసు సర్కిల్ పరిధిలోను, మామిడికుదురు మండలం గోగన్న మఠం, ఆదుర్రు, లూటుకుర్రు, మగటపల్లి, కరవాక, రాజోలులో పలుచోట్ల, మలికిపురం మండలంలోని కేశనపల్లి, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, కేశవ దాసుపాలెంలో రికార్డింగు డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు హోరెత్తాయి. మగటపల్లిలో ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ప్రభయమానం



పంటచేలను దాటుతున్న వీరేశ్వరస్వామివారి ప్రభ



ఏకాదశ రుద్రుల కొలువు


జగ్గన్నతోటలో ఒకే చోట ఏకాదశ రుద్రులను ఒకే రోజు దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఏకాదశ రుద్రుల ఉత్సవంలో అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల 11 గ్రామల నుంచి ప్రభలు మేళతాళ మంగళవాయిద్యాలతో ఉత్సవంలో కొలువుతీరాయి. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలంగా భావించి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జగ్గన్నతోటలో అంగరంగ వైభవంగా ప్రభల తీర్థం

అంబాజీపేట, జనవరి15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోట, వాకలగరువు, చిరతపూడిలో సంక్రాంతి, కనుమ రోజు ప్రభల తీర్థాలు వైభవోపేతంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మరింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలివచ్చాయి. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభ ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుదీరి స్వాగతం పలికింది. కౌశిక అవతలవైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలోకి ప్రవేశించిన ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరువు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుతీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.



వీరేశ్వరస్వామి ప్రభ





అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు, జి.అగ్రహారం ప్రభలు



అధికారుల సేవలు భేష్

పోలీసులు ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో జీవీ సరోవర్, తహశీల్దారు జె.వెంకటేశ్వరి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అప్పర్ కౌశిక వద్ద ఇసుక బస్తాలు, తాగునీటి సౌకర్యంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక సౌకర్యాలు చేపట్టారు.

లక్షకు పైగా..

జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు జగ్గన్నతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చినట్టు అంచనా.. జగ్గన్నతోట తీర్థంలో యువతి, యువకులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. తీర్థంలో రెండెడ్ల బండ్లు సందడి చేశాయి. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు పంట చేలను తొక్కుకుంటూ, అప్పర్ కౌశిక దాటుతున్న దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో బంధించారు.

ఆతిథ్యం ఇచ్చి ఆహా అనిపించి

గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి కొత్త అల్లుళ్లకు జరిగే మర్యాదలు అంతా ఇంతా కాదు.. పండక్కి అత్తవారి ఇంట్లో జరిగే అతిథి మర్యాదలతో పాటు వంటకాలు ఆహా అనిపించేలా ఉంటాయి. ఈ సారి కూడా పలుచోట్ల కొత్త అల్లుళ్లకు అదిరిపోయే ఆతిథ్యమిచ్చారు



660 రకాలతో...

అల్లవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలో కొత్త అల్లుడికి సంక్రాంతి పండుగ సందర్భంగా 660 రకాలతో విందు ఏర్పాటు చేశారు. స్వీట్లు, స్నాక్స్, వివిధ పానీయాలు, వెరైటీ పచ్చళ్లు, డ్రై ఫ్రూట్స్, తిరుపతి, అన్నవరం, విజయవాడ, అయినవిల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్రసాదాలు ఈ విందులో ఉన్నాయి. అల్లవరంలో జంగా వెంకటరత్నంనాయుడు (బుజ్జి) హైదరాబాద్‌కు చెందిన అల్లుడు గంధం హేమంత సాయిదుర్గాప్రసాద్ కోసం ఈ విందు ఏర్పాటు చేశారు. జర్మనీలో దుర్గాప్రసాద్ హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.



200 రకాలతో...

కపిలేశ్వరపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన గ్రంధి గోవిందరాజులు, మంగతాయారు దంపతులు హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తమ అల్లుడికి 200కు పైగా పిండివంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాగా అల్లుడు పసుమర్తి గణపతి గుప్త, కూతురు తేజశ్వినిల తల్లిదండ్రుల స్వగృహాలు అంగర, ఏడిద కాగా గోవిందరాజులు, మంగతాయారు దంపతులు ఈ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు.

72 రకాలతో...

ఆలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కంచర్ల సూర్యనారాయణ ఇంట్లో సంక్రాంతికి వచ్చిన అల్లుళ్లు నవీన్, పవన్‌లకు 72 రకాల వంటకాలను వండించి సంక్రాంతి రుచులతో అదరగొట్టారు. భారీ అరటిఆకులో అల్లుళ్లు, కూతుళ్లకు ఒకేసారి వడ్డించారు.



అనపర్తిలో అంబరాన్నంటేలా...

వైభవంగా వీరుళ్లమ్మ జాతర
అమ్మవారిని దర్శించుకున్న లక్ష మందికి పైగా భక్తులు
ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా



జాతరలో బాణసంచా కాల్పుల దృశ్యాలు



అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తేర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం రాత్రి అంబరాన్నంటింది. సంక్రాంతి రోజు రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. రాత్రి 8 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధులు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న గరగను తలకెత్తుకుని ఎమ్మెల్యే జాతర ఉత్సవాలను ప్రారంభించారు. సుమారు లక్షమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవీచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గరగ నృత్యాలతో బాటు, వివిధ ఆర్కెస్ట్రాలు, కోయ మేళాలు వంటి వి ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ కళాకారులు ఆకట్టుకున్నారు. అదేవిధంగా బాణసంచా కాల్పుల పోటీలు భక్తులకు కనువిందు చేశాయి. హైదరాబాద్ ఎగ్జిబిషన్ పేరుతో ఏర్పాటు చేసిన కొలంబస్, జెయింట్ వీల్, చిన్నారులకు బోటింగ్ వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. బుధవారం అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర సారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, చింతా ప్రకాశరెడ్డి, బెండమూరి రాజు, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులున్నారు.



అనపర్తిలో గరగనెత్తుకుని జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. సంక్రాంతి, కనుమ 2రోజులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది స్వామిని దర్శించుకున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకోగా ఫొటోషూట్ల వద్ద భక్తజన సందడి కనిపించింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి 2 రోజుల్లో రూ.9 లక్షల 46 వేల 408 ఆదాయం లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తులు

పండుగ పూట కబళించిన మృత్యువు

భోగిమంటలో పడిన వ్యక్తి మృతి



మృతిచెందిన నాగబాబు

వై.రామవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రెండు కాళ్లు లేకున్నా ఆత్మస్థైర్యంతో బ్రతుకు నీడ్చుకొస్తున్న అతడిని పండుగ పూట మృత్యువు కబళించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరానికి చెందిన పడాల నాగబాబు (49) సోమవారం అర్ధరాత్రి దాటక ఇంటి ముందు వేసిన భోగి మంట వద్ద కూర్చునేందుకు వెళ్లాడు. పీటపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. గతంలో అతడికి కాళ్లకు వ్యాపించిన వ్యాధులు కారణంగా రెండుసార్లు రెండు కాళ్లు తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్న అతడు భోగి మంటలో పడి మృతిచెందడంతో విషాదం నెలకొంది. నాగబాబును భార్య, కుటుంబీకులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని బుధవారం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సతీష్‌కుమార్ మృతదేహం, (ఫైల్ ఫొటో)

తుని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన అలమండ సతీష్‌కుమార్ (40) సోమవారం తెల్లవారుజామున తుని నుంచి డి.పోలవరం బైక్‌పై బయల్దేరాడు. తుని-నర్సీపట్నం రోడ్డులో డి.పోలవరం గండి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

భోగాపురంలో
నాలుగురోజుల పాటు నిర్వహణ

పిఠాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం కళాపరిషత్ తృతీయ వార్షిక నాటక మహోత్సవంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయ స్థాయి నాటిక పోటీలు, వారాహి రంగస్థల విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరగనున్నాయి. 19 వరకూ ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నారు. 16న రాత్రి గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ద్వారబందాల చంద్రయ్యానాయుడు నాటిక, గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం మిట్టపాలెం కృష్ణా ఆర్ట్స్ థియేటర్స్ కళాకారులు ప్రేమించే వయసేనా నాటిక ప్రదర్శిస్తారు. 17న రాత్రి విశాఖపట్టణం ఉక్కునగరం చైతన్య స్రవంతి కళాకారులు అసత్యం నాటిక, విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ఆంగికం భువనం యస్య నాటిక, హైదరాబాదు మిత్ర క్రియేషన్స్ కళాకారులు ఇది రహదారి కాదు నాటిక, 18న రాత్రి హైదరాబాదు తెల్లాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కుసంకెళ్లు నాటిక, యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు నా శత్రువు నాటిక, కర్నాటకలోని బళ్లారి జీఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు చీకటి బ్రతుకులు నాటిక, 19న రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి నాటికలు ప్రదర్శిస్తారు. అనంతరం ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. తర్వాత బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. నాటిక పోటీలకు కళాభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని భోగాపురం నాటక కళా పరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు కోరారు.

రూ.200 ఇవ్వలేదని నిప్పంటించుకున్నాడు

ఖండవల్లిలో గుండాట వద్ద ఘర్షణ

పెరవలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోడిపందాల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన గుండాటలో సొమ్ములు గెలుచుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఒక యువకుడు ఆవేశానికి గురై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన పెరవలి మండలం ఖండవల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంక్రాంతి సందర్భంగా ఖండవల్లిలో కోడిపందాల శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడే గుండాటలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి గంగాధర్(18) గుండాట ఆడుతూ రూ.200 కాశాడు. అయితే తాను గెలిచినప్పటికీ రూ.200 ఇవ్వకపోవడంతో గుండాట నిర్వాహకులతో తగవుపడ్డాడు. నీవు గెలవలేదని, నీకు డబ్బులు ఇవ్వాల్సినపనిలేదని నిర్వాహకులు చెప్పడంతో ఆవేశానికి గురైన యువకుడు మోటార్‌సైకిల్ నుంచి పెట్రోలు తీసి మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం భయాందోళనకు గురై పక్కనే ఉన్న నీళ్ల బోదెలోకి దూకాడు. అప్పటికే శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించారు. అతడి ప్రాణాలకు ఏ ఇబ్బంది లేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఏ కేసు నమోదు చేయలేదు. ఇక్కడ కోడిపందాల శిబిరాన్ని ఈ సంఘటన జరిగిన అనంతరం మూయించివేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్

భారీ బండి.. వచ్చేనండి!



చెన్నై నుంచి ఒడిస్సాకు వెళ్తున్న 120 చక్రాలతో కూడిన భారీ వాహనం రాజానగరం హైవేపై బుధవారం కనిపించింది.
- రాజానగరం

క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● మంత్రి వాసంశెట్టి సుభాష్ ● రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రాత్రి రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాత్రి బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ కోనసీమ ఆధ్వర్యంలో నిర్వహించే 14వ ఆల్‌ఇండియా, 20వ ఏపీ బాస్కెట్‌బాల్ టోర్నమెంటును మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులకు విద్య, ఉద్యోగ నియామకాల్లో కోటా పెంపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రామచంద్రపురంలో చాలా ఏళ్లగా సంక్రాంతికి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఖేల్ ఇండియా పథకంలో అమలాపురం పార్లమెంటులో స్టేడియంలు, క్రీడా ప్రాంగణాలు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడారు. క్రీడాకారులను మంత్రి, ఎంపీ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, లయన్ జి.వీరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా పోటీలు

బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం లీగ్ స్థాయి పోటీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్,చండీఘడ్, చత్తీస్‌ఘడ్, చెన్నైకు చెందిన మెన్ అండ్ ఉమెన్ జట్లు పాల్గొంటున్నాయి.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పురందరదాసు సంకీర్తనల ప్రాచుర్యానికి కృషి

8,600 మహిళ భక్తిమండల గ్రూపులు
దాససాహిత్య ప్రాజెక్టు ఆఫీసర్ ఆనందతీర్థాచార్యులు



మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు

ఆలమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు సంకీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషి చేస్తుందని దీనిలో భాగంగా 8,600 మహిళభక్తి మండల గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రాజెక్టు ఆఫీసర్ పి.నందరతీర్థాచార్యులు తెలిపారు. కోనసీమ జిల్లా ఆలమూరు విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. ఈ గ్రూపుల్లో ప్రస్తుతం 4500 యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. నూతన గ్రూపుల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చామని, ఇందుకోసం వెబ్‌సైట్ నిర్మాణ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. దక్షిత భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందని, పురందరదాసు 4.75లక్షల సంకీర్తనలు రచించారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 47ఏళ్ల క్రితం టీటీడీ దాససాహిత్య ప్రాజక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందర దాసు కీర్తల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తున్నామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించేవిధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. దాససాహిత్య ప్రాజక్టుకు గతేడాది టీటీడీ ద్వారా రూ.2.30కోట్లు బడ్జెటు కేటాయించారని, ఈ సంవత్సరం మార్చిలో బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు. బడ్జెట్ పెంచితే దక్షణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాలలో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ప్రాజక్టు ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి తదితరులు ఉన్నారు.

'పాదగయ'లో సినీ నటుడు ఆది పూజలు



సినీనటుడు ఆదికి స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

పిఠాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని బుధవారం ప్రముఖ సినీనటుడు ఆది సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆదిని ఆలయ మర్యాదలతో ఈవో జగన్మోహన శ్రీనివాస్ సత్కరించి శేషవస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం



ఆలయంలో కిరీటం అందజేస్తున్న దాతలు

కోరుకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి రూ.16 లక్షలు విలువ గల బంగారు కిరీటాన్ని బహుకరించారు. ఈ మేరకు స్వామివారి ఆలయ ముఖ మండపం నందు బంగారు కిరీటాన్ని ఉంచి ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన వీణవల్లి శ్రీనివాస్, ఉషారాణి దంపతులు ఈ బంగారు కిరీటాన్ని అందజేశారు. గతంలో లక్ష్మీదేవికి బంగారు కిరీటం ఉండేదని అయితే లక్ష్మీనరసింహస్వామికి బంగారు కిరీటం అందజేయాలని సంకల్పించుకున్నామన్నారు. దీని ప్రకారం బంగారు కిరీటాన్ని ఆలయంలో పూజ అనంతరం అర్చక స్వాములకు అందజేసినట్టు ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో అనువంశక అర్చక స్వాములు పెద్దింటి సత్తిబాబు, పెదపాటి గిరిధరా చార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



గొల్లప్రోలు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సంక్రాంతి, కనుమ సంబరాల్లో భాగంగా ఎడ్ల బండ్లపై ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణవేషధారణలు, నరకాసుర సంహారం, దేవతామూర్తుల వేషధారణలతో కళాకారులు అలరించారు. గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్లపై వేషాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. రాత్రంతా బళ్ల వేషాలు కొనసాగాయి. పూర్వం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో వీటిని ఏటా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బళ్ల వేషాలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి అధికంగా ప్రజలు తరలివచ్చారు.



చేబ్రోలులో ఎడ్లబండ్లపై వివిధ దేవతామూర్తుల వేషధారణలలో కళాకారులు

సముద్రంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన హోంగార్డు



వికాస్ పాండే నుంచి వివరాలు సేకరిస్తున్న మెరైన్ పోలీసులు

సర్పవరం జంక్షన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా సముద్ర స్నానం చేస్తోండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు ప్రాణాలకు తెగించి రక్షించిన సంఘటన సూర్యారావుపేట బీచ్‌లో బుధవారం జరిగింది. వికాస్ పాండే అనే వ్యక్తి జీవనోపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి రాజమహేంద్రవరం వచ్చి భవనాలకు ఆల్టెక్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలసి బుధవారం మధ్యాహ్నం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చాడు. పలు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి పాండే కొట్టుకుపోతుండడంతో స్నేహితులు హాహాకారాలు చేశారు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న వాకలపూడి మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ రామోహ్మన్ రెడ్డి ఈ విషయాన్ని గుర్తించి ఎస్ఐ సురేష్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రాణాలకు తెగించి హోంగార్డు కె.గంగాధర్ (హెచ్‌జీ 408) సముద్రంలోకి వెళ్లి పాండేను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చాడు. సముద్రం నీరు మింగేసిన పాండేకి మెరైన్ పోలీసులు సపర్యలు చేసి కోలుకునేలా చేశారు. ప్రాణాలకు తెగించి వికాస్ పాండేని కాపాడిన హోంగార్డు గంగాధర్‌కు బహుమతి ఇచ్చి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. బందోబస్తు విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులను అభినందించారు.



హోంగార్డు గంగాధర్‌కి బహుమతి ఇచ్చి సత్కరిస్తున్న మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి

మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో...

19న రాజమహేంద్రిలో వివాహ పరిచయ వేదిక

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మధ్వ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నారు. గోదావరి గట్టున గల మల్లిగ సత్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ వివాహ పరిచయ వేదికకు ప్రముఖ ఆడిటర్ అంగర లక్ష్మీ నరసింహరావు అధ్యక్షత వహిస్తారు. కానుగోని వాసుదేవాచార్యులు వధూవరుల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మధ్వ వధూ వరులు తమ తల్లిదండ్రులతో రావాలని మధ్వ సమాఖ్య బుధవారం ఒక ప్రకటనలో కోరింది.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



నట భూషణ్ శోభన్‌బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విలక్షణ నటుడు శోభన్‌బాబు

● శోభన్‌బాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి):అందాల నటుడు నటభూషణ్ శోభన్‌బాబు 89వ జయంతిని పురస్కరించుకుని అఖిలభారత శోభన్‌బాబు సేవా సమితి ఆ ధ్వర్యంలో మంగళవారం గోదావరిబండ్ రోడ్ లో గల శోభన్‌బాబు విగ్రహానికి అభిమానులు పూ లమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాసమితి గౌరవాధ్యక్షుడు అల్లు బా బీ, సలహాదారు బళ్ళా శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొనకళ్ళ శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి పూడి శ్రీనివాస్, బట్టిప్రోలు శ్రీనివాస్, సోగ్గాడు ప్రసాద్‌లు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృ దయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన నటు డు శోభన్‌బాబు అని ఆయన జ్ఞాపకార్థంప్రతి ఏటా జయంతి, వర్ధంతులు నాడు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సేవాసమితి సభ్యులు కె.ఆనంద్, ఏ.అన్నవరం, న్యూటన్, కె.ఎస్.ప్రకాశరావు,డి. శ్రీనివాస్, జి.సింహాచలం, ఎం.మల్లికార్జునరావు, ఎస్వీవీ సత్యనారాయణ, అనేక ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు పాల్గొన్నారు.

గోపూజ సకల దేవతారాధనతో సమానం



గోమాతకు పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ గిరజాల తులసి

కడియం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గోమాతను పూజించడం ద్వారా సర్వశుభాలు కలుగుతాయని గోసాల సంరక్షణ సమితి అధ్యక్షుడు గిరజాల బాబు అన్నారు. కనుమ పండుగరోజు పురస్కరించుకుని శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గోసాలలో గోసాల సంరక్షణ సమితి అధ్యక్షు డు గిరజాల బాబు, మాజీ సర్పంచ్ గిరజాల తులసి దంపతులు గోమాతకు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ(చినదేవుడు) పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, పిండి మూర్తి, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను, బ్రహ్మం, బాబులు, బాలాజీ, మూర్తి పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితులకు న్యాయం



మార్గానిని సత్కరిస్తున్న దళిత నాయకులు

కడియం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. వీరహనుమాన్ నర్సరీలో టీడీపీ ఎస్సీసెల్, దళిత నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సెల్ రాష్ట్ర నాయకులు, టీడీపీ రాష్ట్ర రైతు విభా గం ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు జల్లి కృపారావు, కాయల సత్యనారాయణ, కనికెళ్ళ బుల్లియ్య, విప్పర్తి శ్రీను, చింతపర్తి నాగేశ్వరరావు, శీలంగోపాలం పాల్గొన్నారు.

లక్ష టన్నుల మాంసం విక్రయాలు

● భారీగా కోడి, చేప, కోస మాంసాలు



రాజమహేంద్రవరంసిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాంప్రదాయ పండుగలు వైభవంగా ముగిశాయి. భోగి, సంక్రాంతి, పండుగల్లో సాంప్రదాయ పిండివంటలు ఆరగించి ఆనందం పొందిన ప్రజానీకం కనుమ, ముక్కనుమలకు వేగంగా నాన్‌వెజ్ వైపు అడుగులు వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ళు, చేపలు, కోస మాంసంతో పాటు పట్టణ ప్రాంతాల్లో బాయిలర్, పారం కోళ్ళు మేక మాంసం కలిపి లక్షల టన్నుల్లో మాంస విక్రయాలు భారీస్థాయిలో జరిగాయి.

సాధారణ రోజుల్లో ఆదివారం వస్తే రాజమహేంద్రవరం వంటి నగరాల్లో లక్ష టన్నుల మాంసం విక్రయం జరుగుతోంది. అటువంటిది పం డుగ పర్వదినం, పైగా కనుమ కావడంతో ఈ సంఖ్య రెట్టింపయ్యింది. కొంతమంది మినహా మిగిలిన వారంతా నాన్‌వెజ్ ప్రియులే కావడంతో కనుమ, ముక్కనుమ లకు నాన్‌వెజ్‌లో ఉన్న వెరైటీస్ అని వండి ంచి ఈ పండుగకు వచ్చిన అతిథులకు వడ్డించడం ఓ ఎత్తు అయితే... స్వయంగా కోళ్ళు, నాటుకోళ్ళు అమ్మవారి ఆలయాలవద్ద అర్పి ంచి మొక్కులు తీర్చుకుని మాంసాహారాన్ని భుజించిన వారు కొందరున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కడి యం, సీతానగరం, ప్రాంతాల్లో మాంసాహార విక్రయాలు భారీగా జరిగాయి.

వైభవంగా తిరువాభరణ ఉత్సవం

● అయ్యప్ప నామస్మరణతో

మార్మోగిన రాజమహేంద్రవరం



తిరువాభరణ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి తీరాన ఉన్న అయ్యప్పస్వామి ఆలయం కు సంబంధించిన స్వామి, అమ్మవార్ల ఆభరణాల తిరువాభరణ ఉత్సవం సంక్రాంతినాడు వైభవంగా జరిగింది. తొలుత స్థానిక ప్రకాష్‌నగర్‌లోని జక్కంపూడి రామ్మోహనరావు నివాసం నుంచి గురుస్వాముల పర్యవేక్షణలో కొత్తపల్లి బుజంగరాయులు, కొత్తపల్లి రామ్‌విలాస్ సుబ్బారాయుడు, కొమ్ముల సాయిలు స్వామి తిరువాభరణములను అమ్మవారి ఆభరణాలను కేరళ, చండై వాయిద్యాలు, కోలాటాలు, డోలు సన్నాయి, మేళతాళాలు, కేరళ సాంప్రదాయ నృత్యాలతో కన్నుల పండువగా టీటీడీ కళ్యాణ మండపం మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించారు. కంబాల చెరువు, దేవీచౌక్, మెయిన్‌రోడ్, డీలక్స్ సెంటర్, విశ్వేశ్వర ఆలయం రోడ్డుమీదుగా అయ్యప్పస్వామి ఆలయానికి ఈ ఊరేగింపు చేరుకుంది. అక్కడి పూజారులకు తిరువాభరణాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు నంబూద్రి సమక్షంలో ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ఆభరణాలను అలంకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తన తండ్రి రామ్మోహనరావు, శ్రీధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం అనే ట్రస్టును ఏర్పాటు చేసి పవిత్ర గోదావరి నదీతీరాన రాజమహేంద్రవరంలో శబరిమలను పోలిన అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించారని, ఇక్కడి స్వామివారి విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేయించామని తెలిపారు. ప్రత్యేక పూజలు అనంతరం మకరసం క్రాంతి జ్యోతి దర్శనం జరిగింది. ఈ కార్యక్రమాల్లో జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ హౌ సింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆ ర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, బ్యూటిఫికేషన్, గ్రీనరీ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, నందెపు శ్రీనివాస్, తోట సుబ్బారావు, పోలసానపల్లి హనుమంతరా వు, మంతెన కేశవరాజు, ఇసుకపల్లి సుబ్రహణ్యం, ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అనపర్తిలో తిరుణాభరణ ఉత్సవం

అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలో ఉన్న స్వామి అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి సందర్భంగా తిరుణాభరణాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు కర్రి సాంబశివరెడ్డి అయ్యప్ప ఆలయ ట్రస్టీ సబ్బెళ్ళ సత్యనారాయణ రెడ్డి నివాసం నుంచి ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకుని గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆభరణాల పెట్టెను పాతవూరు శివాలయం, విష్ణాలయం, బాపనమ్మ ఆలయం, వీరుళ్లమ్మ ఆలయం, మహాలక్ష్మి ఆలయం, బాబా ఆలయాలకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా జరిగిన ఉత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి ఆభరణాలను అలంకరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తనయుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆభరణాల పెట్టెను దర్శించుకున్నారు.

కారును ఢీకొట్టిన లారీ

● తప్పిన పెనుప్రమాదం

గోపాలపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నల్గొండ నుంచి విశాఖపట్నం వెళుతున్న కారుకు గోపాలపురం శివారులో పొగాకు బోర్డు సమీపంలో వైజాగ్ నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బెలూన్‌లు తెరుచుకోవ డంతో పెనుప్రమాదం తప్పింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జైంది.

అనపర్తిలో కోడి పందాలు, పేకాట, గుండాటలపై 21 కేసులు నమోదు

అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలంలో సంక్రాంతి మూడు రోజుల్లో పేకాట, కోడి పందాలు, గుండాటలు నిర్వహిస్తున్న వారిపై 21కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు. పీరా రామచంద్రపురం, దుప్పలపూడి, అనపర్తి, కొప్పవరం, పొలమూరు, కుతుకులూరు, పెడపర్తి, మహేంద్రవాడల్లో, పేకాట, కోడి పందాలు, గుండాటలపై దాడులు నిర్వహించామన్నారు.

జీవకారుణ్య సంఘంలో భోగి పండుగ

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి13(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు గౌతమీ జీవకారుణ్య సంఘంలో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈవో ఎంవీఎస్‌ఎస్‌ఎన్‌శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసి వృద్ధులకు స్వీట్లు, నూతన వస్త్రాలు, పిల్లలకు గాలిపటాలు ఆందజేశారు. ఈ సందర్భంగా ఈవో శర్మ మాట్లాడుతూ ఏటా జీవ కారుణ్యా సంఘం వృద్ధులు, అనాధ బాలల మధ్య సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తుంటామని, వృద్ధులకు, తాము ఒంటరి వాళ్ళంకాదు, తమకు అందరూ ఉన్నారనే భావన కలుగజేసేందుకు ఇలా ఏటా భోగి, సంక్రాంతి నిర్వహిస్తుంటామని అన్నా రు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వి.ఈ. రాజు, పి.రామ్మోహనరావు, పి.విజయకుమార్ పాల్గొన్నారు.

గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలి

● కొమరిపాలెం డీసీ చైర్మన్ వేణు

బిక్కవోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని కొమరిపాలెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి సూచించారు. కొంకుదురులో ఈనెల 13 నుంచి 15 వరకూ కొవ్వూరి బులి వీర్రెడ్డి, సీతయ్యమ్మ దంపతుల జాపకార్థం జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు బుధవారం ముగిసాయి. మహిళల విభాగంలో భీమవరం జట్టు రాజమహేంద్రవరంపై 36-20 తేడాతో గెలుపొంది ప్రథమ స్థానం సాధించగా, రాజమహేంద్రవరం ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. పాలకొండ, పటవల జట్లు తృతీయ, నాల్గవ స్థానాలు పొందాయి. విజేతలకు డీసీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డిలు రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు చొప్పున బహుమతులు అందజేసారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్తి తాతారెడ్డి, కెవివి. సత్యనారాయణరెడ్డి, అడపా సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం జట్టు మహిళలకు నగదు అందిసున్న కొమరిపాలెం డీసీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి

ప్రాచీన ఆలయాలకు పోటెత్తిన భక్తులు



బిక్కవోలు లక్ష్మీగణపతి చెవిలో కోర్కెలు చెప్పుకుంటున్న భక్తులు

బిక్కవోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు బుధవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి లక్ష్మీగణపతిని భక్తులు బారులుతీరి దర్శించుకున్నారు. స్వామి చెవిలో కోర్కెలు చెప్పడానికి భక్తులు పోటీపడ్డారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని అందించారు. అనంతరం పలువురు భక్తులు గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

జంబూపట్నంలో నరసింహస్వామి గ్రామోత్సవం



నరసింహస్వామి గ్రామోత్సవం దృశ్యం

కోరుకొండ, జవవరి 15 (ఆంధ్రజ్యోతి): జంబూపట్నం గ్రామంలో కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అంతకు ముందు కోరుకొండ ఎంపీపీ ఉల్లి బుజ్జిబాబు దంపతులు, గ్రామపెద్దలు లక్ష్మీనరసింహస్వామికి పూజలు, అర్చనలు చేసి తమ గ్రామానికి మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, మంత్రాలతో స్వామివారు పల్లకిలో వెళ్లారు. మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రారంభమైన గ్రామోత్సవం రాత్రి 11.30 వరకు కొత్త జంబూపట్నం, పాత జంబూపట్నం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉల్లి బుజ్జిబాబు, సూర్యకుమారి దంపతులు, సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అంతకుముందు మకర సంక్రాంతి సందర్భంగా పశ్చిమగోనగూడెం గ్రామంలో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల దేవిక, మాజీ సర్పంచ్ కుంచు చల్లారావు, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బీరాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



బీరాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

రంగంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) :రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలో కొలువై ఉన్న బీరాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మీ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులందుకున్నారు. కార్యక్రమంలో రంగంపేట మండలం, సింగంపల్లి ఎన్డీయే కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రాజానగరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మండలంలో చక్రద్వారబంధంలోని శ్రీ సీతారామాంజనేయ బాల భక్త భజన సమాజం ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన సంక్రాంతి రంగవల్లులు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబించే రీతిలో రంగ వల్లులను తీర్చిదిద్దారు. ఈ పోటీల్లో సోడసాని నాగేశ్వరి (కానవరం) ప్రథమ బహుమతి సాధించింది. ద్వితీయ బహుమతి దాయిన రాజకుమారి (చక్రద్వారబంధం); తృతీయ బహుమతి మట్ట పద్మ (నర్సాపురం) గెలుచుకున్నారు. నాల్గు, ఐదు, ఆరు బహుమతులను వరుసగా వి.ధనలక్ష్మి(రాజానగరం), పంతం సాయిరమ్య (భూపాలపట్నం), బొర్రా దుర్గశ్రీ (అమలాపురం) దక్కించుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

రాపాకలో ముగ్గుల పోటీలు

సీతానగరం: రాపాక ఆంజనేయస్వామి గుడి వద్ద చంద్రు బుజ్జియ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులలో రైతు బొమ్మతో వేసిన ముగ్గు వీక్షకులను అలరించింది. ప్రథమ బహుమతి కూకట్ల దుర్గా భవాని ద్వితీయ బహుమతి జిల్లా దివ్య, తృతీయ బహుమతి తోట జ్యోత్స్న విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కోయ్...కోయ్..రూ.కోట్లలో కాయ్

• బరితెగించిన కోళ్లు • ప్రేక్షక పాత్రలో పోలీసు యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్/కడియం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కోయ్... కోయ్... అంటూ కోట్లాది రూపాయల బెట్టింగ్ లతో కోడి పందాలు జరిగాయి. సంక్రాంతికి పది రోజుల ముందు కోడిపందేలు నియంత్రిస్తున్నామని సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్నామని పోలీసుశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ఈ దఫా కోడి పందాలు కష్టమే అని పందెంరాయుళ్ళు భావించారు..కట్ చేస్తే సీను మారింది. భోగి ముందురోజు నుంచే కోడి పందాల బరులు వచ్చేశాయి. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో పిడింగొయ్యి, తొర్రేడు శివారు ప్రాంతం, కాతేరు, శాటిలైట్‌సిటీ, దుళ్ళ, కడియపులంక, అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో పలుచోట్ల గోదావరి అవతల కొవ్వూరు, నిడదవోలు రూరల్, గోకవరం సమీపంలో పలుచోట్ల భారీగా కోడిపందాలు, గుండాటలు జరిగాయి. కోట్లాది రూపాయల బెట్టింగ్ చేతులు మారినట్లు సమాచారం.

పోలీసుల ప్రేక్షకపాత్ర: కోడి పందాలు, గుండాటలు భారీస్థాయిలో జరిగాయి. ఈ పోటీలు తమ్ముళ్ల సహకారంతో జరగడంతో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. పోలీసులు కొన్నిచోట్ల శిబిరాల వద్దకు వెళ్లినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో ఈ మూడు రోజులు పందెంరాయుళ్లకు కాసుల పంట పండింది. కొంతమందికి కలిసిరాగా, మరి కొంత మందికి దాచుకున్న సొమ్మంతా పోయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



కోరుకొండలో నిర్వహిస్తున్న గుండాట

కోరుకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో గుండాట, కోడిపందాలు, పేకాట జోరుగా సాగాయి. ఒక్కో గ్రామంలో రెండేసి బరులు ఏర్పాటు చేసి జూదాలు నిర్వహించారు. సంప్రదాయం కోడిపందెం ముసుగులో ప్రతి గ్రామంలో 4నుంచి 16లక్షల వరకు గ్యాబ్లింగ్ గ్రూప్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుని గుండాట, పేకాట, కోడిపందాలు జరిపారు. ఒక్కో గ్రామంలో లక్ష నుంచి నాలుగులక్షల వరకు గ్రామ దేవతల ఆలయాలకు ఇచ్చేలా గ్రామపెద్దలతో ఒప్పందం చేసుకున్నారు. తదుపరి కూటమి నాయకులు, కమిటీగా ఏర్పడి పందాలు నిర్వహించారు. చాలా గ్రామాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు, లైటింగ్ పెట్టి మరీ పందాలు నిర్వహించారు. కోరుకొండ మండలంలో 3వేలకు పైగా కోళ్ల ప్రాణాలు కోల్పోయి కోసలుగా మారాయి. గుండాట, పేకాటలో రూ.5 కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం.

శ్రీకృష్ణపట్నంలో యథేచ్ఛగా...

రాజానగరం: మండలంలో కోడి పందాలు జోరుగా సాగాయి. కోడి పందాల మాటున ఏర్పాటు చేసిన గుండాట శిబిరాల్లో భారీ స్థాయిలో నగదు చేతులు మారాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. శ్రీకృష్ణపట్నంలో ఏర్పాటు చేసిన కోడి పందాల శిబిరాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా భీమవరం తరహాలో సకల సదుపాయాలతో ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం శిబిరాల్లో ఎల్‌ఈడీ లైట్లు, వీఐపీల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బంధువులు విచ్చేయడంతో ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పించారు. ఏర్పాటు చేశారు. పందాలు సజావుగా సాగేందుకు బౌన్సర్లను ఏర్పాటు చేయడంతో ఏస్థాయిలో పందాలు జరిగాయో తెలుస్తోంది. మహిళలు కూడా కోడి పందాలను తిలకించేలా ఇక్కడ సౌకర్యాలు కల్పించారు. మూడు రోజులపాటు సాగిన కోడి పందాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వారు శ్రీకృష్ణపట్నం తరలివచ్చారు. కోడి పందాల్లో బరికి రూ.1.5 లక్షల వంతున పది పందాల్లో వరుసగా నాలుగు పందాలు గెలిచిన విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లను అందజేశారు. ముక్కినాడ గ్రామంలో తొలిరోజు పందాలు జరిగినప్పటికి నిర్వాహకుల మధ్య విభేదాలు తలెత్తడంతో నిర్వాహకులు పక్క మండలాలకు వెళ్లారు. సీతారాంపురం, కలవచర్ల, రాజానగరం, పుణ్యక్షేత్రం, నందరాడ, వెలుగుబంద, నరేంద్రపురం గ్రామాల్లో కోడి పందాలు, గుండాటలు యథేచ్ఛగా సాగాయి.



కడియపులంక కోడిపందాల్లో పాల్గొన్న తెలంగాణకి చెందిన ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఆయన మిత్ర బృందం

వెలవెలబోయిన కోడి పందాలబరులు

అనపర్తి: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందాలు ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు చోట్ల మాత్రమే పందాలు జరగ్గా, మిగిలిన చోట్ల భోగి రోజు సాయంత్రానికి మూసివేశారు. గతంలో జరిగిన వాటిలో సగం కూడా ఈ ఏడాది జరగలేదని నిర్వాహకులు వాపోయారు. దుప్పలపూడిలో వేసిన కోడి పందాలు జనం లేక వెలవెలబోయాయి. ప్రతియేటా చాగల్నాడు ప్రాంతం నుండి మంచి కోళ్ల వచ్చేవని ఈ ఏడాది సరైన కోళ్ల కూడా రాకపోవడంతో బరులు వెలవెలబోయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలో ఒకటి రెండు చోట్ల నిర్వాహకులకు ఆనందాన్ని మిగిల్చినట్లు సమాచారం.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

రంగంపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువకుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి కబడ్డీ పోటీలు దోహదపడతాయని తెలిపారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా ఎన్డీయే గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నల్లమిల్లి క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల, గ్రామ ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హిందువులంతా సంఘటితంగా ఉండాలి'

దేవరపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జనవరి 5న గన్నవరంలో నిర్వహించిన హైందవ శంఖా రావం సభకు భారీగా హిందువులు హాజరై జయప్రదం చేశారని అన్నారు. హిందువులంతా సంఘటితంగా ఉండాలని తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలకపా టి విజయరాఘవాచార్యులు అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో శ్రీపర్వతం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని హిందువులంతా పాటించాలని రా జులు, పూర్వీకులు నిర్మించిన ఆలయాలను హిందువులకు స్వయం ప్రతిపత్తి కలిగించాలని కోరారు. ఆలయాల పరిరక్షణ కోసం హిందువు లంతా సమాఖ్యంగా పోరాడాలన్నారు. స్థానికు లు బలుసు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ మాజీ అధ్యక్షుడు విజయరాఘవాచార్యులు



శ్రీదేవి పంక్షన్ హాల్‌లో కలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, టెన్త్ క్లాస్ క్లాస్‌మేట్స్

పొలమూరులో ఎమ్మెల్యే టెన్త్ బ్యాచ్ కలయిక

ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరించిన పూర్వ విద్యార్థులు

44 సంవత్సరాల తరువాత అపూర్వ సమ్మేళనం

అనపర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి పంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. 44 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉండటంతో ఈ కలయికకు ప్రాదాన్యం సంతరించుకుంది. తమతో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపైకి రావడంతో ఎమ్మెల్యే వారికి సమయం కేటాయించి ఎక్కువ సమయం గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఉంటున్నారంటూ ఎమ్మెల్యే వారిని పలకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఎమ్మెల్యేగా గెలిచిన నల్లమిల్లిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 50మంది విద్యార్థులు ఈ వేడుకకు హాజరయ్యారు. వీరిలో పలువురు కూటమి నాయకులు కూడా ఉన్నారు. కార్యక్రమంలో నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, గొలుగూరి వీర్రాఘవరెడ్డి తదితరులున్నారు.

కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు.. 7లో

ఊరంతా సంక్రాంతి



కోడి పందేల హోరు

గుండాటల జోరు



అచ్చంపేట జంక్షన్‌లో ..

కాకినాడ జిల్లాలో జూద జాతర

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో కోడిపందేల జాతర కొనసాగింది. పందెంరాయుళ్ల పోటీతో పుంజులు బరుల్లో పోటాపోటీగా తలపడ్డాయి. దీంతో కోట్లలో కట్టలు తెగిపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడ బరుల్లో నువ్వానేనా అన్నట్లు పండగ మూడు రోజులో జిల్లాలో పందేలు జరిగాయి. మూడురోజులపాటు రేయింబవళ్లు కోడి పందేలు హోరెత్తాయి. సంక్రాంతి రోజైతే ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి మరీ పందెం రాయుళ్లు పోటీపడ్డారు. పందేలు కాయడానికి వచ్చే వారిని ఆకట్టుకునేందుకు భారీ షామియానాలు, కుర్చీలు, లైవ్‌షోలు, డ్యాన్సులు, విందు ఏర్పాటు చేయడంతో బరులన్నీ జాతరలను తలపించాయి. బరులను ఆనుకుని గుండాట వ్యాపారం కోట్లలో జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు గుండాట బోర్డులు నిర్వాహకులకు కోట్లలో కాసులు కురిపించాయి.

కాకినాడ జిల్లావ్యాప్తంగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా మూడురోజుల్లో కోడిపందేలు, గుండాట కలిపి రూ.250 కోట్లకుపైగా వ్యాపారం జరిగింది. పోలీసులు సైతం బరులవైపు కన్నెత్తి చూడకపోవడంతో పందెంరాయుళ్లు బరితెగించేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా 490వరకు బరులు ఏర్పాట్లయ్యాయి. కరప, కాకినాడ రూరల్ మండలాల్లో కోడి పందేల విజేతలకు బుల్లెట్లు, కారు బహుమతులుగా ఇవ్వడంతో పందెంరాయుళ్లు విరగబడ్డారు. తుని నియోజకవర్గం పరిధిలో కోటనందూరు, తుని, తొండంగిలో పోలవరం కాలువ వెంబడి, హైవే తోటల్లోను భారీగా బరులు నిర్వహించారు. పెద్దపెద్ద టెంట్లు, లైట్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. [illegible] నియోజకవర్గంలో పందేలు, గుండాట, పేకాట కలిపి రూ.15కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. ప్రత్తిపాడులో ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన గుండాట వ్యాపారికి మూడురోజుల్లో రూ.25 లక్షల లాభం వచ్చింది. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో పామాయిల్ తోటల్లో మూడురోజులపాటు జరిగిన కోడి పందేలు, గుండాట జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచాయి. తెలంగాణ నుంచి సైతం పందెంరాయుళ్లు రావడంతో ఒక్కో బరిలో కోట్లలో వ్యాపారం జరిగింది. జగ్గంపేటలో ఓ బరిని రూ.36లక్షలకు వేలంలో పాడుకున్న ఓ నిర్వాహకుడు అంతకు రెండింతలు గడించారు. సామర్లకోటలో ఏకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి పందేలు ఆడించారు. నియోజకవర్గంలో రూ.45కోట్ల వరకు లావాదేవీలు జరగ్గా గుండాట వ్యాపారమే రూ.32కోట్ల వరకు ఉంది. పిఠాపురం నియోజకవర్గం మొత్తం 80వరకు బరుల్లో పందేలు, గుండాట కలిపి రూ.25కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. కాకినాడ రూరల్‌లో ఒక్కో బరిని కొందరు రూ.30లక్షల నుంచి రూ.38లక్షలకు వేలంలో దక్కించుకోవడంతో పందెంరాయుళ్లను ఆకర్షించడానికి అనేక ఎత్తులు వేశారు. కరప మండలం కొరుపల్లిలో మూడురోజుల్లో అత్యధికంగా పందేలు గెలిచిన విజేత డేగల నాగేంద్ర అలియాస్ గోల్డ్‌బాబుకు రూ.18లక్షలు విలువ చేసే మహీంద్రా థార్ వాహనాన్ని నిర్వాహకులు అందజేశారు. పెద పూడి, తాళ్ల రేవు, కాజులూరు మండలాల్లో రూ.5కోట్ల చొప్పున గుండాట వ్యాపారం జరిగింది.



ఐ.పోలవరం: ముమ్మిడివరం బైపాస్ బరిలో

రూ.200 కోట్ల పందేల సందడి

రాజమహేంద్రవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి):
తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజులపాటు కోడిపందేలు, గుండాటలు, పేకాటల పేరిట రూ.200కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా. బరుల నిర్వాహకులకు గుండాట బోర్డులు తీసుకున్నవారు రూ.13కోట్ల వరకూ ఇచ్చారు. 18 మండలాల పరిధిలో ఒక్కో మండలానికి కనీసం 7 కోడిపందేల బరుల వంతున జిల్లాలో మొత్తం 125 బరుల వరకూ నడిచాయి. కోడిపందేల నిర్వాహకులు ముందుగా గుండాటలు, పేకాట నిర్వాహకులతో ఒప్పందం పెట్టుకున్నారు. గుండాట నిర్వాహకులు ఒక్కో బరికి కనీసం రూ.10లక్షలు ముందుగానే కోడిపందేల బరి నిర్వాహకులకు అందజేయాలని ఒప్పందం చేసుకున్నారు. రాజానగరంలో 10 గుండాట బోర్డులు పెట్టుకోవడానికి రూ.21లక్షలు నిర్వాహకులకు చెల్లించినట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులకు రూ.2.5కోట్ల నుంచి 3కోట్ల ముడుపులు అందినట్టు అంచనా. ఒక్కో బరి నిర్వాహకులు కనీసం 4 నుంచి 6 కేసులు పోలీసులకు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. భోగి నుంచి మొదలైన పందేలు కనుమరోజు సాయంకాలం ఐదుగంటలకే ముగియాల్సి ఉన్నా చాలాచోట్ల ఆరు, ఆరున్నర గంటలకు నిలిపివేశారు.

కోనసీమ జిల్లాలో కోట్లాట

చేతులు మారిన కోట్లాది రూపాయలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):
డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా సంక్రాంతి మూడురోజు నిర్వహించిన జూదాలు, పందేల్లో రూ.75కోట్ల మేర చేతులు మారినట్టు సమాచారం. పందేలు, రికార్డింగ్ డ్యాన్సులు యథేచ్ఛగా నిర్వహించినా కొందరు పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మురమళ్ల, చెయ్యేరు, కేశనకుర్రుపాలెం, రాజుపాలెం, రోళ్లపాలెం, గెద్దనపల్లి, గోడి, గోడిలంక, కామనగరువు, సమనస, పేరూరు, ఇందుపల్లిగరువు, రావులపాడు, వెదిరేశ్వరం, శివకోడు, మామిడికుదురు, అల్లవరం, రాణేలంక, కొత్తలంక, లొల్ల, పేరవరం, తాడిపూడి, ర్యాలి, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లిల్లో జాతీయ రహదారిని ఆనుకుని శివకోడు, వీవీ మెరక సబ్‌స్టేషన్, గున్నేపల్లి అగ్రహారం, కొంకాపల్లి, నడవపల్లి, గోగన్నమఠం, పాశర్లపూడి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంకతో పాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధితో సహా 400కు పైగా కీలక ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కీలక బరులు వద్ద కోడిపందాలు, గుండాట, పేకాట వంటి పోటీల ద్వారా కోట్లాది రూపాయిల మేర లావాదేవీలు జరిగినట్టు అంచనా. అమలాపురం, కాకినాడ ఎంపీలు గంటి హరీష్‌మాధుర్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందతోపాటు అనేకమంది కూటమికి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై తిలకించారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌లో సంక్రాంతి సంబరాల పేరిట ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఉత్సవాల్లో కోడిపందేలు, గుండాట, బైక్ రైడింగ్‌లతోపాటు రాత్రివేళల్లో జబర్దస్త్ బృందాల ఆధ్వర్యంలో డ్యాన్సులు, హాస్యవల్లరి కార్యక్రమాలు నిర్వహించారు. రాజోలు మండలం పాలగుమ్మిలో పందెం బరి వద్ద రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలో పలుచోట్ల సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు హోరెత్తించాయి.



రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో



కొవ్వూరు మండలం పశివేదలలో..



ఐ.పోలవరం: పోటీలను తిలకిస్తున్న నేతలు



కరప: గొర్రిపూడి బరిలో గుండాట



తాళ్లపూడి:పందెంలో గెలుచుకున్న బుల్లెట్



కరప: జీపును గెలుచుకున్న గోల్డ్‌బాబు



రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కోడి పందాల విజేతకు బుల్లెట్ బహుమతి

కొత్తపేటలో ప్రభల సంబరం





కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద కొలువుదీరిన ప్రభలు

కొత్తపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం వేలాది జనసందోహం మధ్య అంబరాన్నంటింది. రాష్ట్రం నలుమూలలు నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం ప్రభల ఉత్సవాన్ని తిలకించేందుకు విచ్చేశారు. బోడిపాలెం, కొత్త, పాత రామాలయం వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రభలను ఊరేగింపుగా తీసుకురాగా వాటి ముందు మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాలు, సంగీత విభావరులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రభలు ముందుకు నడిచాయి. భక్తుల సందర్శనార్థం ప్రభుత్వ ఉన్నతపాఠశాలవద్ద ప్రభలు కొలువయ్యాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, ఏపీ బీజేపీ ప్రచారక్ విజయ ఆదిత్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు మొక్కుబడులు తీర్చుకున్నారు. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

వేలచింతలగూడెంలో క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలు

హాజరైన మంత్రి కందుల దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు



గోపాలపురం మండలం వేలచింతలగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, పక్కనే పలువురు ఎమ్మెల్యేలు

గోపాలపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపండుగ సంక్రాంతి అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గోపాలపురం మండలంలోని వేలచింతలగూడెంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఛైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపండుగ సంక్రాంతిని రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ, చిర్రి బాలరాజు, బత్తుల బలరామకృష్ణ, ధర్మరాజు, ఆదిరెడ్డి వాసు, బొలిశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాల్లో చివరి రోజైన ముగింపు సంబరాల్లో సినీగాయకులచే సంగీత విభావరి కార్యక్రమం ప్రజలను ఉర్రూతలూగించింది. యాంకర్స్ వింధ్యా, విశాఖ, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి మాటలతో యువతను ఆకట్టుకున్నారు. సినీగాయకులు కృష్ణచైతన్య, కల్పన, వాగ్దేవి, కాసర్ల శ్యామ్, మోహన్‌భోగరాజు, సాకేత్, జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, రాజమౌళి, గడ్డం నవీన్, తన్మయి, గణేషన్, నృత్యకళాకారుడు గోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఆరునెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు



అమలాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు జోరందుకున్నాయి. రాజోలు పోలీసు సర్కిల్ పరిధిలోను, మామిడికుదురు మండలం గోగన్న మఠం, ఆదుర్రు, లూటుకుర్రు, మగటపల్లి, కరవాక, రాజోలులో పలుచోట్ల, మలికిపురం మండలంలోని కేశనపల్లి, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, కేశవ దాసుపాలెంలో రికార్డింగు డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు హోరెత్తాయి. మగటపల్లిలో ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



పంటచేలను దాటుతున్న వీరేశ్వరస్వామివారి ప్రభ



ప్రభయమానం

జగ్గన్నతోటలో అంగరంగ వైభవంగా ప్రభల తీర్థం

అంబాజీపేట, జనవరి15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోట, వాకలగరువు, చిరతపూడిలో సంక్రాంతి, కనుమ రోజు ప్రభల తీర్థాలు వైభవోపేతంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ ప్రాంతం భక్తజన సంద్రంగా మరింది. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలివచ్చాయి. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వర స్వామి ప్రభ ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుదీరి స్వాగతం పలికింది. కౌశిక అవతలవైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వర స్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలోకి ప్రవేశించిన ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరువు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుతీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.

వీరేశ్వరస్వామి ప్రభ





అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు, జి.అగ్రహారం ప్రభలు





ఏకాదశ రుద్రుల కొలువు

జగ్గన్నతోటలో ఒకే చోట ఏకాదశ రుద్రులను ఒకే రోజు దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఏకాదశ రుద్రుల ఉత్సవంలో అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల 11 గ్రామల నుంచి ప్రభలు మేళతాళ మంగళవాయిద్యాలతో ఉత్సవంలో కొలువుతీరాయి. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలంగా భావించి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అధికారుల సేవలు భేష్

పోలీసులు ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో జీవీ సరోవర్, తహశీల్దారు జె.వెంకటేశ్వరి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అప్పర్ కౌశిక వద్ద ఇసుక బస్తాలు, తాగునీటి సౌకర్యంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక సౌకర్యాలు చేపట్టారు.

లక్షకు పైగా..

జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు జగ్గన్నతోటలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చినట్టు అంచనా.. జగ్గన్నతోట తీర్థంలో యువతి, యువకులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. తీర్థంలో రెండెడ్ల బండ్లు సందడి చేశాయి. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు పంటచేలను తొక్కుకుంటూ, అప్పర్ కౌశిక దాటుతున్న దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో బంధించారు.

గోపూజ సకల దేవతారాధనతో సమానం

కడియం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గోమాతను పూజించడం ద్వారా సర్వశుభాలు కలుగుతాయని గోసాల సంరక్షణ సమితి అధ్యక్షుడు గిరజాల బాబు అన్నారు. కనుమ పండుగరోజు పురస్కరించుకుని శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గోసాలలో గోసాల సంరక్షణ సమితి అధ్యక్షుడు గిరజాల బాబు, మాజీ సర్పంచ్ తులసి దంపతులు గోమాతకు ప్రత్యేకపూజలు చేశారు.


కొవ్వూరు మండలం పశివేదలలో పందాలలో తలపడుతున్న కోడి పుంజులు

యథేచ్ఛగా కోడి పందాలు

● బరుల వద్ద ఏరులై పారిన మద్యం ● చేతులు మారిన కోట్లాది రూపాయలు ● కన్నెత్తి చూడని పోలీసు యంత్రాంగం

కొవ్వూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా కొవ్వూరు మండలంలో కోడి పందాలు, గుండాట, పేకాట వంటి జూదక్రీడలు యథేచ్ఛగా కొనసాగాయి. బోగి రోజు నుంచి మూడురోజులపాటు మండలంలోని పశివేదల, కుమారదేవం, పంగిడి, సీతంపేట, కొవ్వూరు పట్టణంలోని వెంకాయమ్మ చెర్వువద్ద కోడి పందాలు నిర్వహించారు. మూడురోజులపాటు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పందెల పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారాయి. కోడి పందాలతో పాటు గుండాట, కోతాట, పేకాటలను మూడురోజుల పాటు భారీఎత్తున నిర్వహించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, ఇతరశాఖల అధికారులు కానీ అటువైపుగా కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. మండల ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడి పందాలతోపాటు, గుండాటలు, పేకాటలు జరిగాయి. మద్యం కావలిసినంత అందుబాటులోకి రావడంతో అక్కడే కూ ర్చుని తాగిన సందర్భాలు ఉన్నాయి. పందాలలో పోరాడిన పుంజులు (కోసలు)లకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఒక్కొక్క పుంజు 3వేలకు పైగానే ధర పలకడంతో కోసలకు భారీగా డిమాండ్ పలికింది.

గోపాలపురం: సంప్రదాయ ముసుగులో మండలంలోని ఆయా గ్రామాల్లో కోడి పందాలు, గుండాట, పేకాట పోటీలు నిర్వహించారు. మూడు రోజులపాటు కోడిపందాలతోపాటు గుండాట, పేకాటలు నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు చెందిన బంధు మిత్రులు వచ్చి కోడి పందాలు తిలకించేందుకు అనువుగా ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. కోడిపందాల బరిలో మహిళలు తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చేతులు మారిన కోటి రూపాయలు

నిడదవోలు: నిడదవోలు, డి.ముప్పవరం, విజ్జేశ్వరం, తాడిమళ్ళ పలుగ్రామాలలో సుమారు 12 చోట్ల కోడిపందేల బరులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రతిబరిలోను కోళ్ళకు కత్తులు కట్టి కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేల వద్ద సుమారు కోటి రూపాయలకు పైగానే పందేలు జరిగినట్లు ఒక అంచనా.కోతాట, గుండాట, పేకాటల వద్ద మరో యాభై లక్షల రూపాయల వ్యాపారం జరిగినట్లు సమాచారం. ఈ కోడిపందేల నిర్వాహకులకు ఒక ప్రజాప్ర తినిధి అండగా ఉండడంతో గొడవలు, కొట్లాటలు జరిగిన పోలీసులు కేసులు నమోదు చేయలేక నిస్సాహయంగా ఉండిపోయినట్లు పోలీస్‌వర్గాల్లో వినికిడి.

కోడిపందేలను వీక్షిస్తున్న అమెరికా తెలుగువారు

నిడదవోలులో జరిగిన కోడి పందేలను వీక్షించేందుకు స్థానికులతో పాటు బయట రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి పలువురు ఉత్సాహంగా తరలివచ్చారు. బుధవారం నిడదవోలులో జరిగిన కోడిప ందేలను అమెరికా దేశంలోని ఒహాయో రాష్ట్రంలో స్థిరపడిన తెలుగువారు సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చి కోడిపందేలను వీక్షించేందుకు కుటు ంబాలతో సహా వచ్చారు.

కోడిపందేల బరిలో కొట్లాట

మండలంలోని డి.ముప్ప వరంలో కోడిపందేల బరిలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగి ట్రాఫిక్ సైతం నిలిచిపోయింది. గుండాట నిర్వహించే నిర్వాహకులకు ఆడేవారికి వచ్చిన తగాదాలే వాగ్వివాదంతో మొదలై ఒకరిపై ఒకరు చేయిచేసుకునేంత వరకు వెళ్ళిందని స్థానికులు తెలిపారు. కొట్లాట విషయం గురించి సమిశ్రగూడెం పోలీసులకు ఫోన్‌చేస్తే స్పందన లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ కొట్లాటకు సంబంధించి రాజకీయ నాయకుల జోక్యంతో ఎటువంటి కేసు నమోదు కాలేదని సమాచారం.


హోరాహోరీ పోరు


కోసలు రెడీ


గుండాట

నల్లజర్ల: మండలంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. మండలంలో పోతవరం, చీపురుగూడెం, నల్లజర్ల, దూబచర్ల, ఘంటావారిగూడెం, ప్రకాశరావుపాలెం, తెలికిచర్ల, చోడవరం, అనంతపల్లి గ్రామాల్లో కోడిపందేల శిబిరాలు వెలిశాయి. వివిధ గ్రామాల్లో జోడి పందాలు 25వేల నుంచి 2లక్షల వరకు జరిగాయి. కోడి పందాలు చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఉద్యోగులు క్యూకట్టారు.

దేవరపల్లి: మండలంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు కోడిపందాలు నిర్వహించారు. మండలంలో 8గ్రామాల్లో కోడిపందాల బరులు ఏర్పాటుచేశారు. ఈ బరుల్లో గుండాట, మద్యం షాపులు యథేచ్ఛగా నిర్వహించారు. ఈ కోడిపందాల ద్వారా కోట్లాది రూపాయలు చేతులు మారాయి.

ముగిసిన సంక్రాంతి జాతర

చాగల్లు: మండలంలో సంక్రాతి సంబరాలు పేరుతో కోడి పందాలు జోరుగా నిర్వహించారు. మండలంలోని మీనానగరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, కలవలపల్లి, చిక్కాల గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కోడి పందాలు జోరుగా నిర్వహించారు. గుండాట, పేకాట శిబిరాలు కూడ ఏర్పాటు చేశారు. పందాల శిబిరాలవద్ద వందలాది మంది పందెం రాయుల్లు పోటీలలో పాల్గొని లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. అరుశిబిరాల్లోను రోజుకు రూ.కోటివరకు చేతులు మారాయి.

జోరుగా కోడిపందాలు..

ఉండ్రాజవరం: కోడిపందాలు మండలంలో మూడు రోజులు జోరుగా సాగాయి. ఉండ్రాజవరంలో 4, పాలంగిలో 1, చివటంలో 1, వడ్లూరులో ఒక బరిలో కోడిపందాలు, జూదం, గుండాట నిర్వహించారు. అక్కడే బిర్యానీ పాయింట్లు ఏర్పాటు చేశారు. మూడురోజులు కోడిపందాలు, గుండాట, పేకాట ద్వారా సుమారు రూ.70లక్షలు వరకు చేతులు మారవచ్చని అంచనా. బుధవారం పోలీసులు కోడిపందాలు నిర్వహిస్తున్న బరులపై దాడిచేసి 14 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జి. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వీరిపై 5 కేసులు నమోదు చేశామన్నారు. వీరి నుంచి రూ.10,550లు నగదు, 4 కత్తులు, 4 కోళ్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.


కొవ్వూరు మండలం పశివేదలలో పందేలకు రడీగా ఉన్న పుంజులు


వాడపల్లిలో చెంచులకు స్వీట్స్ పంపిణీ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

చెంచులకు స్వీట్స్ పంపిణీ చేసిన ఆర్డీవో

కొవ్వూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ అందరికీ ఆనందాన్ని పంచాలని కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలోని ఎస్టీ ఏరియాలో ఎంపీపీ కాకర్ల నారాయుడు ఆధ్వర్యంలో చెంచు కులస్తుల నివాస ప్రాంతాలను సందర్శించి వారి మధ్య సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత 14 కుటుంబాలకు చెందిన 28 మంది చిన్నారులకు స్వీట్స్, కేకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెల్లా ప్రసాద్, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.హెచ్.ఎస్.సూర్యప్రకాశరావు, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, వీఆర్వో కె.రూస్వీరాణి పాల్గొన్నారు.

బీరుబాటిల్‌తో గాయపర్చిన ముగ్గురిపై కేసు నమోదు

కొవ్వూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తండ్రీ, కొడుకుని అడ్డగించి బీరుబాటిల్‌తో కొట్టి గాయపర్చిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన సంగీత చిన్నరాజు తన చిన్నకుమారుడు కిరణ్ విఘ్నేష్‌ను తీసుకుని బండిపై ఈనెల 14వ తేదీ సాయంత్రం పొలం బయలుదేరాడు. మార్గమధ్యలో మచ్చా వెంకటరమణ, అల్లం సంజు, కొత్తపల్లి ప్రసన్నకుమార్ మరి కొంత మంది బండిని అడ్డగించి ఘర్షణపడ్డారు. మచ్చా వెంకటరమణ దుర్భాషలాడుతూ నిన్ను చంపితే ఎవర్రా దిక్కు అంటూ చిన్నరాజును కొట్టి బీరు బాటిల్‌తో రెండు చెంపలపై కొట్టి గాయపర్చాడు. కిరణ్ విఘ్నేష్ అడ్డుపడగా అతనిని కొట్టి చంపుతామని బెదిరించారు. విషయం తెలుసుకుని చిన్నరాజు పెద్ద కుమారుడు సంగీత హృదయ కామేష్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన తండ్రి, సోదరుడు ఇద్దరిని నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. హృదయ కామేష్ అందించిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

టాటా ఏస్ వాహనం ఢీకొని మోటారు సైకిలిస్టుకు గాయాలు

కొవ్వూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టాటాఏస్ వాహనం ఢీకొని మోటారు సైకిలిస్టుకు గాయపడినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కామిశెట్టి సత్యనారాయణ మోటారు సైకిల్‌పై ఈ నెల 14న ఉదయం దొమ్మేరు బయలుదేరాడు. మార్గమధ్యలో భారత్‌పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని టాటా ఏస్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ ఎడమకాలుకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

● తప్పిన పెనుప్రమాదం

గోపాలపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నల్గొండ నుంచి విశాఖపట్నం వెళుతున్న కారుకు గోపాలపురం శివారులో పొగాకు బోర్డు సమీపంలో వైజాగ్ నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బెలూన్‌లు తెరుచుకోవ డంతో పెనుప్రమాదం తప్పింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జైంది.

లక్ష టన్నుల మాంసం విక్రయాలు

● భారీగా కోడి, చేప, కోస

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాంప్రదాయ పండుగలువైభవంగా ముగిశాయి. భోగి, సంక్రాంతి, పండుగల్లో సాంప్రదాయ పిండి వంటలు ఆరగించి ఆనందం పొందిన ప్రజానీకం కనుమ, ముక్కనుమలకు వేగంగా నాన్‌వెజ్ వైపు అడుగులు వేశా రు. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ళు, చేపలు, కోసమాంసంతో పాటు పట్టణ ప్రాంతాల్లో బాయిలర్, పారం కోళ్ళు మేక మాంసం కలిపి లక్షల టన్నుల్లో మాంస విక్రయాలు భారీస్థాయిలో జరిగాయి. సాధారణ రోజుల్లో ఆదివారం వస్తే రాజమహేంద్రవరం వంటి నగరాల్లో లక్ష టన్నుల మాంసం విక్రయం జరుగుతోంది. అటువంటిది పండుగ పర్వదినం, పైగా కనుమ కావడంతో ఈ సంఖ్య రెట్టింపయ్యింది. కొంతమంది మినహా మిగిలిన వారంతా నాన్‌వెజ్ ప్రియులే కావడంతో కనుమ, ముక్కనుమలకు నాన్‌వెజ్‌లో ఉన్న వెరైటీస్ అని వండించి ఈ పండుగకు వచ్చిన అతిథులకు వడ్డించడం ఓ ఎత్తు అయితే... స్వయంగా కోళ్ళు, నాటుకోళ్ళు అమ్మవారి ఆలయాలవద్ద అర్పిం చి మొక్కులు తీర్చుకుని మాంసాహారాన్ని బుజించిన వారు కొందరున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కడి యం, సీతానగరం, ప్రాంతాల్లో మాంసాహార విక్రయాలు భారీగా జరిగాయి.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు


ఉండ్రాజవరంలో సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు


చాగల్లు: చంద్రవరంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, జనవరి 15, (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలను ప్రజలు సాంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకున్నారు. మండలంలోని మల్లవరంలో గ్రామయువకులు కమిటీగా ఏర్పడి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు, లెమన్, స్పూన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చంద్రవరంలో వంటల పోటీలు, పిల్లలకు సైకిల్ పోటీలు, ముగ్గులు పోటీలు పిల్లలకు పాటలు, డ్యాన్సులు, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి బంధుమిత్రులతో పండువగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, మద్దిపాటి వీరరాఘవులు, రాజాబాబు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో సంక్రాంతికి ప్రత్యేకత

గోపాలపురం: భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో సంక్రాంతికి ప్రత్యేకత ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గస్థాయిలో మంగళవారం ముగ్గులపోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా కాసు బంగారం, రెండో బహుమతి వెండి కంచం, 3వ బహుమతిగా పట్టుచీరలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్అండ్ఎం ఫౌండే షన్ చైర్మన్ గంటా మధు కృష్ణ, సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు కొర్లపాటి రాము, చినబాబు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులతో పారిశ్రామికవేత్త జీవీ

తాళ్ళపూడి : సంక్రాంతి పండుగ అంటే కోడి పందాలే కాదు. సంస్కృతి సాంప్రదాయాలు పాటించడం సంక్రాంతిలో భాగమే అంటూ తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటలో టీడీపీ నాయకులు కొత్తదనానికి శ్రీకారం చుట్టారు. పాతతరం రోజులు గుర్తుకుతెచ్చేలా ఒక ఇల్లు, ఇంటిముందు పదిమంది కూర్చోవడం, రైతులకు గుర్తుగా ఎడ్లబండి ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతానికి వచ్చిన ప్రతిఒక్కరూ ఆ ఇంటివద్ద సెల్ఫీలు, ఫోటోలు దిగి సందడి చేశారు. పారిశ్రామికవేత్త జీ.వి.ఆధ్వర్యంలో యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, గణపతి తదితరులు సంక్రాంతి సంబరాలు చేపట్టారు. టీడీపీ అధికారం చేపట్టిన తరువాత వచ్చిన మొదటి సంక్రాంతి వేడుకలు జరిపామని, రాబోయో రోజులలో మరింత సందడి చేస్తూ సంక్రాంతి జరుపుకోవాలని బావిస్తున్నట్లు యువగళం నాయకులు సత్యేంద్ర తెలిపారు. జీ.వి.మాట్లాడుతూ యు.ఎస్., ఆస్ట్రేలియాలో ఉంటున్న ప్రవాసాంధ్రులు వేడుకలలో పాల్గొన్నారన్నారు. తాళ్ళపూడి వచ్చిన వారంతా పందెం కోళ్ళను పట్టుకుని ఫోటోలు దిగారు. ఇతర ప్రాంతాల్లో ఉండేవారు సొంతఊరికి వచ్చి జీ.వి.చేసిన ఏర్పాట్లకు ఆనందం వ్యక్తం చేశారు.

సంప్రదాయాలకు పల్లెలు పట్టుకొమ్మలు

నిడదవోలు: సంస్కృతి సాంప్ర దాయాలకు పల్లెలు పట్టుకొమ్మలని డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ అన్నారు. మంగళవారంరాత్రి నిడదవోలు మండలం కంసా లిపాలెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ మా ట్లాడుతూ రంగవల్లులు సాంప్రదాయానికి చిహ్నాలని అన్నారు. అనంతరం విజేతలైన మహి ళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పం చ్ కొండపల్లి శ్రీను, అమ్మవారి ఆలయ ప్రతినిధి బాబీ, కాశీ, విజయ్ తదితర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల అందజేత

కొవ్వూరు: పోటీల ద్వారా గ్రామీణప్రాంత యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయవచ్చునని కొవ్వూరు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ దుద్దుపూడి రాజారమేష్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొవ్వూరు పట్టణంలో సన్‌రైజర్స్ యూత్ ఆధ్వర్యంలో త్రోబాల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతగా కొవ్వూరు జట్టు, రన్నర్‌గా నిలిచిన వేములూరు జట్టుకు బహుమతులు అందజేశారు. రాజారమేష్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలలోను ప్రావీణ్యం సాధించి, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సన్‌రైజర్స్ యూత్ సభ్యులు ఎ.సునీల్‌కుమార్, ఎస్.ఎన్వీ. గణేష్, జి.రామనాగేశ్వరరావు, కె. శీనివాసరావు, ఎన్. రవికిరణ్, డి. వంశీకృష్ణ పాల్గొన్నారు.

వేలివెన్నులో సంక్రాంతి సంబరాలు

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులో మంగళవారం శశిధర్ మెమోరియల్‌లో సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేలివెన్నులోని రెండు రోడ్ల మొగ సెంటర్‌లో పిల్లల ఆటలపాటలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. చిన్నారులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు ప్రజలు సాంప్రదాయగా జరుపుకోవడం సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ తనయుడు డాక్టర్ కందుల కృష్ణతేజ దంపతులు, గ్రామసర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కె.సావరంలో ముత్యాలమ్మ జాతర ఉత్సవం మంగళవారంరాత్రి ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణ, నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో వైభవంగా జాతర నిర్వహించారు.


తాళ్లపూడి: అన్నదేవరపేటలో సంక్రాంతికి సిద్ధం చేసిన ఇల్లు


గోపాలపురం:వేలచింతలగూడెం ముగ్గులపోటీలో మొదటి బహుమతిగా కాసు బంగారం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి


కొవ్వూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజారమేష్


నిడదవోలు: కంసాలిపాలెంలో ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ


గోపాలపురంలో కలుసుకున్న 2002-03 పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గోపాలపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 2002-2003 సంవత్స రానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు పూర్వపు విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహిం చారు. విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరి విద్యను బోధించిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాల్గొన్నారు.

పోలవరం కుడి కాల్వకు నీరు విడుదల చేయాలి


నీరు విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

నల్లజర్ల, జనవరి15: (ఆంధ్రజ్యోతి): పోలవరం కుడి కాల్వకు నీరు విడుదల చేయాలని సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నల్లజర్ల మండలం సింగరాజుపాలెంలో పోలవరం కుడి కాల్వలోకి దిగి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇప్పటికే రెండో పంట వేసి నీటికోసం ఎదురు చూస్తున్నారని, విలువైన భూములను ప్రభుత్వానికి త్యాగంచేసిన రైతులకు నీరు లేకుండా పోతుందన్నారు. గొల్లగూడెంవద్దఉన్న లిఫ్ట్ ద్వారా కాల్వలో ఉన్న నీటిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు తరలించుకుపోవడం ద్వారా మండలంలో అచ్చన్నపాలెం, నల్లజర్ల, ఆవపాడు, సింగరాజుపాలెం గ్రామాల రైతులకు నీరు లేకుండాపోయిందన్నారు. పట్టిసీమ లిఫ్ట్ ద్వారా మార్చినెల వరకు నీరు అందిస్తే రెండో పంట పండుతుందని రైతులు చెబుతున్నారు.

'హిందువులంతా సంఘటితంగా ఉండాలి'


విలేకరులతో మాట్లాడుతున్న తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలకపాటి విజయరాఘవాచార్యులు

దేవరపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జనవరి 5న గన్నవరంలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు భారీగా హిందువులు హాజరై జయప్రదం చేశారని అన్నారు. హిందువులంతా సంఘటితంగా ఉండాలని తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలకపాటి విజయరాఘవాచార్యులు అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో శ్రీపర్వతం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని హిందువులంతా పాటించాలని రాజులు, పూర్వీకులు నిర్మించిన ఆలయాలను హిందువులకు స్వయం ప్రతిపత్తి కలిగించాలని కోరారు. ఆలయాల పరిరక్షణ కోసం హిందువులంతా సమాఖ్యంగా పోరాడాలన్నారు. స్థానికులు బలుసు సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.10వేలు ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన గుమ్మడి లక్ష్మి కుటుంబానికి మంత్రి కందుల దుర్గేష్ వారి తరపున తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సహాయంగా తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అందజేశారు. అదేవిధంగా 25కేజీల బియ్యం, 1కేజీ కందిపప్పు, 1 కేజీ పంచదార పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మెండి లలితకుమారి, గ్రామ ఉపసర్పంచ్ నందిన శ్రీని వాస్, కూటమి నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, శిరిగిన బాబీ రమేష్, ఆచంట సాయిరామ్, మెండే శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఇల్లు కాలిపోయిన లక్ష్మికి సాయం అందజేస్తున్న అధికారులు, నాయకులు